మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 22-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 234 Issue: 234

22 ఫిబ్రవరి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:42 సూర్యాస్తమయం - సా. 6:16 తిథి పంచమి ఉ. 11:09 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం అశ్విని సా. 5:53 వరకు తరువాత భరణి యోగం శుక్ల మ. 1:00 వరకు కరణం భాలవ ఉ. 11:09 వరకు కౌలవ రా. 10:10 వరకు వర్జ్యం మ. 2:06 నుండి మ. 3:37 వరకు దుర్ముహూర్తం సా. 4:43 నుండి సా. 5:30 వరకు రాహుకాలం సా. 4:50 నుండి సా. 6:16 వరకు యమగండం మ. 12:29 నుండి మ. 1:56 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:50 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:06 నుండి తె. 5:54 వరకు అమృత ఘడియలు ఉ. 11:03 నుండి మ. 12:34 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## రోజురోజుకు పెరుగుతున్న కేసులు
## నిమ్మకు నీరెత్తినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం?

# గురుకులాలు.. విషాలయాలు!

## భారీగా పెరుగుతున్న ఫుడ్ పాయిజన్లు
## ఈ ఏడాదే 100కుపైగా విద్యార్థులకు అస్వస్థత
### గత ఏడాది ఏకంగా 886 సంఘటనలు.. 2000 మంది విద్యార్థులకు అస్వస్థత

సుమారు **50** మంది స్టూడెంట్స్ మృతి

Investigation STORY

మెదక్ జిల్లా రేగోడ్ కేజీబీవీలో ఉదయం టిఫిన్ తిని 22 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లు అస్వస్థతకు గురయ్యారు
- ఫిబ్రవరి 20, 2026

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బోడియాతండా ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి 38 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు.
- జనవరి 30, 2026

సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం వెంకటాపూర్ స్కూల్‌లో 45 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.
- జనవరి 29, 2026



టిఫిన్ తిని విద్యార్థులకు అస్వస్థత..
భోజనం వికటించి విద్యార్థుల ఆస్పత్రుల పాలు..
మధ్యాహ్నం భోజనంలో పురుగులు..
స్కూళ్లలో నాణ్యతలేని నూనెల వాడకం..
గురుకులాల్లో అపరిశుభ్రంగా కిచెన్ షెడ్లు..
ఇలాంటి హెడ్డింగులతో రోజుకో వార్త
గురుకులాల్లో పరిస్థితి ఇంత దారుణమా?
విద్యార్థులంటే పాలకులకు అంత చిన్న చూపా?
మాకు పోయేదేంటన్న అధికారుల అలసత్వమా?

(ఈవార్తలు ఇన్వెస్టిగేషన్ డెస్క్)
'జాతీయ స్థాయిలో గురుకుల విద్యార్థి ప్రతిభ'... 'పురుగుల అన్నం పెడుతున్నారని రోడ్డెక్కిన గురుకుల విద్యార్థులు'... తమను ప్రోత్సహిస్తే దేశానికే వన్నె తెచ్చేలా చేస్తామన్న అదే గురుకుల విద్యార్థి, ఫుడ్ పాయిజన్‌పై రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తోంది. మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తామన్న భావి భారత పౌరులు.. బుక్కెడు తిండి కోసం బజారుమీదికి తరువాయి 2 వ పేజీలో...



# బడి పిల్లలకు ఉప్పుడు బియ్యం

మార్చి 1 నుంచి స్టీమ్ బియ్యంతో అన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా.. మార్చి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్టీమ్ బియ్యాన్ని సరఫరా చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా అన్ని జిల్లాల అధికారులకు సర్క్యులర్ జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలల్లో సుమారు 25 లక్షల మందికిపైగా పిల్లలకు ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. వీరితోపాటు 10 లక్షల మందికిపైగా వివిధ సంక్షేమ హాస్టళ్లనూ విద్యార్థులకూ అవసరమైన సన్నబియ్యాన్ని సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ సరఫరా చేస్తోంది. కొత్త బియ్యాన్ని కొన్ని నెలలు నిల్వచేస్తే పాతగా మారి అన్నం పొడిగా తయారవుతుంది. ప్రస్తుతం నెలల తరబడి నిల్వ చేసేందుకు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,928 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,291 |

## విశ్వవాణి



మానవ చరిత్రలో కొత్త తరాలు వచ్చినప్పుడల్లా కొత్త ఆలోచలు పుడుతూ వచ్చాయి. మెదడు వికాసం చెందుతోంది. కానీ, చరిత్రలోనే తొలిసారి జనరేషన్ జెడ్.. ఆ మెదడు వికాసాన్ని కోల్పోతున్నారట. డిజిటల్ టెక్నాలజీపై అధికంగా ఆధారపడటం వల్ల ఆలోచనా శక్తి తగ్గి, సృజనాత్మకత తగ్గుతోందని, వారి తల్లిదండ్రుల కంటే తక్కువ తెలివి తేటలు కలిగి ఉంటున్నారని న్యూరో సైంటిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# నాకూ తప్పలేదు

**పీసీసీ అధ్యక్షుడిగా వ్యతిరేకత ఎదుర్కొన్నా.. డీసీసీ శిక్షణ శిబిరంలో సీఎం రేవంత్ రెడ్డి**

కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ మొదటి నుంచి.. భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచే హక్కు ఉందని తెలిపారు. వేర్వేరు అభిప్రాయాలు చెప్పినంత మాత్రాన.. అలాంటి నేతలను వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కాదని స్పష్టం చేశారు.

వికారాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): ఇది గతంలో మహాత్మాగాంధీ ఉన్నప్పటి నుంచి కొనసాగుతోందని చెప్పారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ లో ఉన్న నేతలం మనలో మనం ఘర్షణలకు దిగితే.. పార్టీని కాపాడటం కోసం కష్టపడుతున్న లక్షల మంది కార్యకర్తలకు తరువాయి 2 వ పేజీలో...

# ఏందీ రాజకీయ నాటకాలు?

## ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నిరసనపై కేటీఆర్ ఫైర్

దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో యూత్ కాంగ్రెస్ సభ్యుల నిరసనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. అంతర్జాతీయ వేదికపై రాజకీయ నాటకాలు తగవు అంటూ మండిపడ్డారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): ఎక్కడ.. ఎలా నిరసన తెలపాలో అర్థం చేసుకోవాలని హితవు పలికారు. ట్విట్టర్ వేదికగా.. 'అంతర్జాతీయ వేదికపై రాజకీయ నాటకాలు తగవు. యూత్ కాంగ్రెస్ సభ్యులు తమ అల్ప రాజకీయ నాటకాల కోసం ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026ను వేదికగా ఎంచుకోవడం అత్యంత విచారకరం. ఇలాంటి అంతర్జాతీయ వేదికలను నిరసనల కోసం ఉపయోగించడం వల్ల, ప్రపంచ దేశాల ముందు మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమే, కానీ ఎక్కడ, ఎలా నిరసన తెలపాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేయడానికి ఒక సమయం, సందర్భం ఉంటాయి. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 వంటి తరువాయి 2 వ పేజీలో...

# నేను మోనార్క్‌ని!

## నన్నెవరూ భయపెట్టలేరంటున్న ట్రంప్
### సుప్రీం కోర్టుకే ఎదురెళ్లిన అమెరికా ప్రెసిడెంట్
### సుంకాలు 10 శాతం నుంచి 15 శాతానికి పెంపు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలు చెల్లవని అక్కడి సుప్రీం కోర్టు చెప్పిన కొన్ని గంటల్లోనే మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా 15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు.

వాషింగ్టన్: దశాబ్దాలుగా పలు దేశాలు అమెరికాను దోచుకున్నాయని ఆయన ఎదురు దాడికి దిగారు. సుప్రీం కోర్టు తీర్పును క్షుణ్ణంగా, పూర్తిగా సమీక్షించిన తర్వాత ఈ సుంకాల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. ముున్ముందు సుంకాలను చట్టబద్ధం చేస్తామని తేల్చి తరువాయి 2 వ పేజీలో...




# 1,110 ఫైల్స్ బూడిద

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో కీలక ఆధారాలు దగ్ధం
### నిర్ధారించిన నాగపూర్ ప్రత్యేక బృందం.. డాటా రికవరీ కష్టమేనని స్పష్టీకరణ

నాంపల్లి-హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో కీలక మలుపు చోటుచేసుకుంది. అగ్ని ప్రమాదంలో పదకొండు వందల కేసు ఫైల్స్ దగ్ధం అయినట్టు నాగపూర్ ప్రత్యేక బృందం గుర్తించింది. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో ఉన్న సగం ఫైల్స్ దగ్ధం అయినట్టు గుర్తించారు. 1100 కేసుల తరువాయి 2 వ పేజీలో...

# ఏపీలో 2 ఫేక్ వర్సిటీలు

## ఢిల్లీలో అత్యధికంగా 12
### దేశవ్యాప్తంగా 32 నకిలీ విశ్వవిద్యాలయాలు
### జాబితా విడుదల చేసిన యూజీసీ

2



# రాశి ఫలాలు

22.2.2026

మేషం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. మిత్రుల నుంచి ఊహించని సమస్యలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహంగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

వృషభం: ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. ఆకస్మిక ధన లాభసూచనలున్నవి. నూతన వస్తు లాభాలు పొందుతారు. స్థిరాస్థి వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి పొందుతారు.

మిధునం: అవసరానికి ఇతరుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ఆర్థిక విషయాలు నిరాశ కలిగిస్తాయి. పనులలో తొందరపాటు చేసి ఇబ్బందికి గురి అవుతారు. కొన్ని వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. దూరప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు.

సింహం: ఇతరుల నుండి రావలసిన సొమ్ము సకాలంలో చేతికందదు. దూరప్రయాణం సూచనలు ఉన్నవి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

కన్య: సమాజంలో విశేషమైన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సంతాన విద్యా విషయాలలో అప్రయత్న విజయం సాధిస్తారు. బంధుమిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది. నిరుద్యోగుల యత్నాలు సానుకూలమవుతాయి.

తుల: వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. రాజకీయ పరమైన పరిచయాలు పెరుగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

వృశ్చికం: గృహ నిర్మాణ పనులు ముందుకు సాగవు. ఆర్థిక ఇబ్బందులు నిరాశ కలిగిస్తాయి. వ్యాపారమున నూతన సమస్యలు కలుగుతాయి. ఉద్యోగ వాతావరణం కొంత చికాకు కలిగిస్తుంది. ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

ధనస్సు: చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. చేపట్టిన పనులలో శ్రమాధిక్యం తప్పదు. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. విద్యార్థుల ప్రయత్నాలు మందగిస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. బందు మిత్రులతో వివాదాలు కలుగుతాయి.

మకరం: ప్రయాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగయోగం ఉన్నది. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తివ్యాపారాలు అంతగా అనుకూలించవు. ఆకస్మిక ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. ఇంటా బయట ఊహించని సమస్యలు ఉంటాయి. సంతాన అనారోగ్యం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

మీనం: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన మిత్రుల పరిచయాలు కలుగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. విద్యార్థులు అనుకూల ఫలితాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

# ..విషాలయాలు!

మొదటి పేజీ తరువాయి

రావాల్సి వస్తోంది. గురుకులాల్లో ప్రస్తుతం నెలకొంటున్న సంఘటనలు విద్యార్థుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్మేలా చేస్తున్నాయి.

నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకులాలు, కేజీబీవీలు.. ప్రస్తుతం విద్యార్థుల ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యా కుసుమాలు విరియాల్సిన గురుకులాలు నేడు అనారోగ్య నిలయాలుగా మారుతున్నాయి. ఈ మధ్య కాలంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు గణనీయంగా పెరగడమే ఈ ఆందోళనకు కారణం. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), సాంఘిక సంక్షేమ గురుకులాలు, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఈ ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. వివిధ నివేదికలు, అధికారిక ప్రకటనల ప్రకారం రాష్ట్రంలో ఏకంగా దాదాపు 1,000 ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది ఆగస్టు నాటికే 886 ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో దాదాపు 2,000 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురైన ఆస్పత్రుల పాలయ్యారు. అదీకాక 48–51 మంది విద్యార్థులు మరణించారు. గత ఆర్నెల లెక్కలు తీస్తే మరింత పెరగొచ్చు. రాష్ట్రంలోని గురుకులాల్లో పదేపదే జరుగుతున్న ఫుడ్ పాయిజన్లపై గత నంబర్‌లో హైకోర్టు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్యాంగ సంస్థల జోక్యంతో పాలకులు ఆగమేఘాల మీద ఏదో ఉద్ధరిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసినా, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించినా, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినా పరిస్థితి మారడం లేదు. మరి ఇది.. పాలకుల అలసత్వమా? అధికారుల అలసత్వమా? బాసర ట్రిపుల్ ఐటీ, ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పలుమార్లు విద్యార్థులు పెద్దమొత్తంలో అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మంలో జనవరిలో బోడియాతండా పాఠశాలలో జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది.



## ప్రభుత్వం ఏం చేస్తోంది?

**చాలా సందర్భాల్లో గురుకులాల్లో పాత నిల్వలు, పురుగులు పట్టిన బియ్యం, నాణ్యత లేని నూనెలను వాడటం ప్రధాన కారణంగా తెలుస్తోంది. కిచెన్ షెడ్లు అపరిశుభ్రంగా ఉండటం, వంట మనుషులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, నీటి ట్యాంకులు సకాలంలో శుభ్రం చేయకపోవడం వల్ల బ్యాక్టీరియా సోకుతోంది.**

ఇలాంటి వాటిపై అధికారులు దృష్టి సారించకపోవడం దారుణం. ఇక.. గురుకులాలకు, పాఠశాలలకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన 'మెస్ ఛార్జీల' బకాయిలు పేరుకుపోవడంతో, వారు నాణ్యతలో రాజీ పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం డైట్ ఛార్జీలను పెంచినట్లు ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందుతున్న ఆహారంలో మార్పు రాకపోవడం శోచనీయం. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అమాయక విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా, షోకాజ్ నోటీసులతో సరిపెట్టకుండా, బాధ్యులైన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ చేయాలి. అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి గురుకులంలో 'ఫుడ్ సేఫ్టీ ఆడిట్' నిర్వహించి, విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు, పౌష్టికాహారం అందుతున్నాయని భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

# నాకూ తప్పలేదు

మొదటి పేజీ తరువాయి

అన్యాయం చేసినట్లు అవుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సన్నద్ధత, ప్రజలతో అనుసంధానం కోసం కాంగ్రెస్ పార్టీ తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ–డీసీసీ) అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడిని అయ్యే సమయానికి కాంగ్రెస్ పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేదని ఈ రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తాను పార్టీలో ఉన్న కొందరు నేతల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నానని తెలిపారు. తన ఆలోచనలను పార్టీలోని అందరి నేతలను కలిసి చెప్పి అందర్నీ ఒప్పించానని వెల్లడించారు. కార్యకర్తలు, నేతలు అందరూ కలిసి కృషి చేయడంతోనే పార్టీకి ఓటింగ్ పెరిగిందని తెలిపారు. గతంలో డీసీసీ అధ్యక్షులుగా మంచిగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మంది నేతలకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. నేతలందరి పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్న సీఎం.. మెరిట్ ఉన్నవారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌లో ఎలాంటి లిస్టులకు చోటు లేదని.. కేవలం మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. డీసీసీ పదవి చాలా విలువైందని.. వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీసీసీ పదవి ఎన్నో పదవులకు తలుపులు తెరుస్తుందని.. పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కూడా కావొచ్చని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక గాంధీ కుటుంబంపై వస్తున్న ఆరోపణలపై స్పందించిన రేవంత్ రెడ్డి.. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గొప్ప కుటుంబం గాంధీలది అని గుర్తు చేశారు. దేశం కోసం రూ.వేల కోట్ల



ఆస్తులను మోతీలాల్ నెహ్రూ త్యాగం చేశారని.. ఎన్నో ఏళ్లు జవహర్‌లాల్ నెహ్రూ జైలులో ఉన్నారని గుర్తు చేశారు. భారతదేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య నడిచారని పేర్కొన్నారు. గాంధీల కుటుంబంపై అవినీతి ఆరోపణలు గట్టిగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు.

# ఏపీలో 2 ఫేక్ వర్సిటీలు

## ఢిల్లీలో అత్యధికంగా 12

### దేశవ్యాప్తంగా 32 నకిలీ విశ్వవిద్యాలయాలు

**జాబితా విడుదల చేసిన యూజీసీ**

న్యూఢిల్లీ: ఏపీలోని గుంటూరులో ఉన్న క్రీస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నంలోని బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా నకిలీ విశ్వవిద్యాలయాలు అని యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక ప్రకటన చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 32 విశ్వవిద్యాలయాలు నకిలీవని ప్రకటించింది. ఈ ఫేక్ యూనివర్సిటీలు ఇచ్చే డిగ్రీలకు ఎలాంటి చట్టబద్ధత ఉండదని స్పష్టం చేసింది. ఉద్యోగాలకు లేదా ఉన్నత చదువులకు ఈ విశ్వవిద్యాలయాలు జారీ చేసే ధృవపత్రాలు పనికిరావని తేల్చి చెప్పింది. విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందడానికి ముందే ఆయా సంస్థల గుర్తింపును విద్యార్థులు తనిఖీ చేసుకోవాలని కీలక సూచనలు జారీ చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 12 నకిలీ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని యూజీసీ వెల్లడించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 4 ఫేక్ యూనివర్సిటీలు ఉన్నట్లు గుర్తించింది. యూజీసీ చట్టంలోని సెక్షన్ 2(ఎఫ్), 3 ప్రకారం.. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు లేని ఈ సంస్థలు డిగ్రీలు జారీ చేసే అధికారం కలిగి లేవని తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో తనిఖీలు చేపట్టి.. తగిన అర్హతలు ఉంటే అనుమతులు ఇవ్వడం లేకపోతే నిరాకరించడం.. బ్లాక్ లిస్టులో పెట్టడం వంటివి చేస్తుంది. ప్రతీ సంవత్సరం అలా అర్హత లేని యూనివర్సిటీలను గుర్తించి.. నోటీసులు జారీ చేస్తుంది.

### నకిలీ వర్సిటీల జాబితా

ఢిల్లీ 12, ఉత్తర్‌ప్రదేశ్ 4, ఆంధ్రప్రదేశ్ 2, కర్ణాటక 2, కేరళ 2, మహారాష్ట్ర 2, పుదుచ్చేరి 2, పశ్చిమ బెంగాల్ 2.. అరుణాచల్ ప్రదేశ్ 1, హర్యానా 1, జార్ఖండ్ 1, రాజస్థాన్ 1 యూనివర్సిటీ ఉందని యూజీసీ వెల్లడించింది.

### ఢిల్లీలోని ఫేక్ వర్సిటీలు

- యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ
- వొకేషనల్ యూనివర్సిటీ
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం
- కర్ణాటక బెంగళూరులోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ
- కేరళలోని సెయింట్ జాన్స్ యూనివర్సిటీ
- మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని రాజా అరబిక్ యూనివర్సిటీ
- ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని గాంధీ హిందీ విద్యాపీఠ్
- ఉత్తర్‌ప్రదేశ్ అలీఘర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఓపెన్ యూనివర్సిటీ

# బడి పిల్లలకు ఉప్పుడు బియ్యం

మొదటి పేజీ తరువాయి

సర్కార్‌కు ఇబ్బందులున్నాయి. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు స్టీమ్ రైస్ సరఫరాకు పౌరసరఫరాల శాఖ నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రభుత్వ పాఠశాలలే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఈ స్టీమ్ రైస్ సరఫరా కానుంది.

# ఏందీ రాజకీయ నాటకాలు?

మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ సదస్సు కచ్చితంగా దానికి వేదిక కాదు. వారి సొంత పార్టీ సీఎం రేవంత్ రెడ్డి అదే ఏఐ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు ఈ నిరసన చేపట్టడం విచిత్రంగా ఉంది' అని నిరసనలకు సంబంధించిన ఫొటోను షేర్ చేశారు.

# నేను మోనార్క్‌ని!

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. గతంలో తీసుకున్న దానికంటే ఎక్కువ సుంకాలు విధించేందుకు సాధ్యమైన చర్యలన్నీ తీసుకుంటామని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. కాగా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లను అమెరికా అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసిన సంగతి తెలిసిదే. ప్రపంచ దేశాలపై టారిఫ్స్ వేసే హక్కు అధ్యక్షుడికి లేదని యూఎస్ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయినా, ట్రంప్ మాత్రం తగ్గడం లేదు.




# 1,110 ఫైల్స్ బూడిద

మొదటి పేజీ తరువాయి

డాటా రికవరీ కోసం నాగాపూర్ ప్రత్యేక బృందం యత్నం చేసింది. కానీ, కేసుల డేటా రికవరీ కావడం కష్టం అని తేల్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. హైదరాబాద్ మహా నగరంలోని నాంపల్లిలో గల ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఈరోజు (డిసెంబర్ 7న) ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ల్యాబ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినా, అప్పటికే చాలా ఆధారాలు కాలిపోయాయి. ఈ ల్యాబ్‌లోని ఎఫ్‌ఎస్‌ఎల్ కంప్యూటర్లోనే కీలక కేసులు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో ఉన్న సగం ఫైల్స్ దగ్ధం అయినట్టు అధికారులు పేర్కొన్నారు.

# క్షమత భవన్.. రైతు బడి

## 'అగ్రి' విద్యార్థులకు దిక్సూచి.. ప్రారంభించిన శివరాజ్ సింగ్ చౌహాన్

### సాగు ప్రణాళికలు రైతుల ఆదాయాన్ని పెంచాలి.. వ్యవసాయ శాస్త్రవేత్తలకు కేంద్ర మంత్రి పిలుపు




హైదరాబాద్, ఫిబ్రవరి 21 (పీఐబీ): వ్యవసాయ శాస్త్రవేత్తలు చేసే సాగు ప్రణాళికలు రైతుల ఆదాయాన్ని పెంచేలా ఉండాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఐసీఏఆర్–నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఏఏఆర్ఎం) లో నూతనంగా నిర్మించిన క్షమత భవన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూనె గింజలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా, రైతుల ఆదాయాన్ని పెంచేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. క్షమత భవన్ వ్యవసాయ రంగంలోని భాగస్వాములు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ సంస్థల పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలను కేంద్ర మంత్రి సమీక్షించారు. అన్ని ఐసీఏఆర్ సంస్థల కృషిని అభినందించారు. అంతకుముందు, డీఏఆర్ఈ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాంగి లాల్ జాట్.. శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చలు జరిపారు. వ్యవసాయ శాస్త్రీయ పరిశోధనల్లో ఆలోచనలు, వనరులను వినియోగించేటప్పుడు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, వినూత్నంగా ఆలోచించాలని ఆయన సూచించారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (మత్స్య, వ్యవసాయ విద్య) డాక్టర్ జయకృష్ణ జెనా కూడా పాల్గొన్నారు. ఐకార్ – నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రికి నార్మ్ చేపడుతున్న వివిధ సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు, సంస్థ సాధించిన విజయాల గురించి వివరించారు. కాగా, క్షమత భవన్ ఐసీఏఆర్– ఎన్ఏఏఆర్ఎం మౌలిక సదుపాయాలకు ఒక ముఖ్యమైన జోడింపు. ఈ భవనం కేవలం ఒక కట్టడమే కాకుండా, వ్యవసాయ రంగంలోని వివిధ భాగస్వాముల, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రంగా పనిచేస్తుంది. ఐసీఏఆర్ – నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ స్వర్ణోత్సవ వేడుకల వేళ ఈ భవనం ప్రారంభం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది.

### అభివృద్ధిలో రాజకీయాలకు తావు లేదు: శివరాజ్ సింగ్

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయాలకు తావు ఉండదని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పని చేయాలని తెలంగాణతో ఎటువంటి వివక్ష ఉండదు అని హామీ ఇచ్చారు. రాష్ట్ర కేంద్ర సహకారం భారత పురోగతికి అవసరమని పేర్కొన్నారు. ఇవాళ హైదరాబాద్‌లోని హోటల్ కాకతీయలో జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సు, 25వ కేంద్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం రాజకీయాలు పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వ కలిసి వస్తుందని, అందుకు తెలంగాణ ప్రభుత్వానికి అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లక్ పతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామని శివరాజ్ సింగ్ తెలిపారు. ఇప్పటికే కోట్లాది మహిళలు ఎస్‌హెచ్‌జీల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగస్వాములయ్యారని, తదుపరి లక్ష్యం మరింత విస్తరణేనని చెప్పారు. బ్యాంకర్లు కేవలం రుణదాతలుగా కాకుండా భాగస్వాములుగా మారాలని సూచించారు.




# ఆవిష్కరణల్లో భారత్ ఆధిపత్యం

### నైపుణ్యాభివృద్ధిలో అగ్రగామి.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

### ఎఫ్‌డీడీఐ స్నాతకోత్సవానికి హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (పీఐబీ): తయారీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిలో భారత్ ఆధిపత్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లో 5వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదక శక్తిగా ఉన్న పాదరక్షలు, తోలు రంగం లక్షల మందికి ఉపాధిని కల్పిస్తోందని, ఎగుమతులు, ఎంఎస్ఎంఈల వృద్ధికీ గణనీయంగా దోహదపడుతోందని స్పష్టం చేశారు. దేశంలో ప్రపంచస్థాయి సామర్థ్యాలను బలోపేతం చేయడం కోసం సాంకేతికత, సుస్థిరత, డిజైన్ ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలని గ్రాడ్యుయేట్లకు సూచించారు. ఎఫ్‌డీడీఐ మేనేజింగ్ డైరెక్టర్ వివేక్ శర్మ (ఐఆర్ఎస్) ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన కోర్సు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా సమర్థులైన నిపుణులను అభివృద్ధి చేయడం పట్ల సంస్థ నిబద్ధతను వివేక్ శర్మ స్పష్టం చేశారు. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి ఆవిష్కరణలు, సుస్థిరత, నైతిక పద్ధతులు, వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించే ఆలోచనలను స్వీకరించాలని విద్యార్థులకు చెప్పారు. నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధన, పరిశ్రమ ఏకీకరణ ద్వారా భారత పాదరక్షలు, తోలు, ఫ్యాషన్, రిటైల్ వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఎఫ్‌డీడీఐ కీలక పాత్ర పోషిస్తూనే ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. డిజైన్, తయారీలో సుస్థిర పద్ధతులను, ఔత్సాహిక పరిశ్రమలను, ప్రపంచస్థాయి ప్రమాణాలను ప్రోత్సహించడానికి ఈ సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి (ఐఏఎస్), అధ్యాపకులు, పరిశ్రమల భాగస్వాములు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గడ్డి మందుపై నిషేధం విధించాలి

### సీఎం రేవంత్‌కు మాజీ ఎంపీ వినోద్ లేఖ



కరీంనగర్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): రాష్ట్రంలో గడ్డిమందుపై నిషేధం విధించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. 'రాష్ట్రంలో క్షణికావేశంలో గడ్డిమందు తాగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచంలో 70 దేశాలు ఈ గడ్డి మందును నిషేధించాయి. తెలంగాణలో కూడా గడ్డిమందు నిషేధంపై ఆలోచన చేయాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు ఆత్మహత్యలకు పాల్పడిన మెజార్టీ రైతుల్లో.. గడ్డిమందును వాడిన వారే ఎక్కువగా ఉన్నారు. రైతులు, సామాన్యుల ప్రాణాలను రక్షించే క్రమంలో ఈ అంశంపై తక్షణమే స్పందించి నిర్ణయం తీసుకోవాలి. తెలంగాణలోని అనేక ప్రాంతాల నుంచి, రైతుల నుంచి సేషేధం విధించాలనే డిమాండ్ ఉంది' అని ఈ సందర్భంగా వినోద్ కుమార్ గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సీఎస్ రామకృష్ణారావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరామ్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషన్‌కు లేఖ రాశారని వినోద్ కుమార్ వివరించారు.

## యువమోర్చా నేతలపై థర్డ్ డిగ్రీ దుర్మార్గం

### టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) నేతలపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ దాడులకు తెగబడ్డారని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఈ దారుణం జరిగిందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల జరిగిన 'ఏఐ గ్లోబల్ సమ్మిట్'లో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు దేశానికి తలవంపులు తెచ్చిందని ఆరోపిస్తూ బీజేపీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో, బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి శాంతియుతంగా నిరసన తెలిపేందుకు బయలుదేరిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ కుండెతో పాటు ఇతర నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని రామచందర్ రావు తెలిపారు. ఇది ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనని అన్నారు. అంతేకాకుండా, అరెస్టు చేసిన నాయకులను పోలీస్ వ్యాన్‌లో తరలిస్తుండగా, వారి పట్ల అసభ్య పదజాలం వాడుతూ థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని విమర్శించారు. కేవలం ఢిల్లీలో ఉన్న రాహుల్ గాంధీ మెప్పు పొందడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఇంతటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. పోలీసులు తమ విధులను పక్కనపెట్టి, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న కార్యకర్తల్లా వ్యవహరించడం మానుకోవాలని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నది జాతీయ పార్టీ అయిన బీజేపీ అనే స్పృహ పోలీసులకు ఉండాలని గుర్తుచేశారు. ఈ దాడి ఘటనపై తక్షణమే స్పందించాలని, బీజేవైఎం నాయకులను దుర్భాషలాడి, దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై విచారణ జరిపి, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, బాధ్యులైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## చంచల్‌గూడ జైలులో ఉగ్ర కుట్ర జరగలేదు!

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ములాఖత్‌లలో ఉగ్రకుట్రకు ప్రణాళికలు రచించారనే ప్రచారంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఉగ్రకుట్రల వార్తలన్నీ వదంతులేనని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఐజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలు, కొన్ని ఛానళ్లలో చంచల్‌గూడ జైలు నుంచి ఉగ్రకుట్ర అని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో ఏదైనా విషయాన్ని ప్రసారం చేయడానికి ముందు నిజానిజాలు ధృవీకరించుకోవాలని సూచించారు. బాధ్యతాయుతమైన మీడియా ఛానళ్లు ఇలాంటి విషయాలలో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ ఛానళ్లలో ఇలాంటి వార్తలు వస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని అన్నారు. ప్రజల్లోని ఆందోళన తొలగించడానికే ఈరోజు మీడియా ముందుకు వచ్చామని అన్నారు. చంచల్‌గూడ జైల్లో లష్కరేకు చెందిన ఉగ్రవాది ఒక్కడే ఉన్నాడని తెలిపారు. అతనికి కూడా భార్యతో తప్ప ఎవరితోనూ ములాఖత్ లేదని స్పష్టం చేశారు.

# భారత్ అంటే మోదీ ఒక్కరేనా?: పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): దేశ రాజధాని ఢిల్లీలోని 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో నిన్న జరిగిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. భారత మండపంలో జరుగుతోన్న సదస్సు వేదిక వద్దకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకుని చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. హాల్ నెంబర్ 5లోకి ప్రవేశించి మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీ పోలీసులు నిరసనకారులను అరెస్టు చేశారు. ఈ ఘటనపై మంత్రి స్పందించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు బీజేపీ పార్టీది కాదని, అది భారత ప్రభుత్వం నిర్వహిస్తోందని పొన్నం ప్రభాకర్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది అంతర్జాతీయ కార్యక్రమమని గుర్తు చేశారు. భారత్ అంటే ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరే కాదని, ప్రతిపక్ష నాయకులను కూడా గౌరవించాలన్న విషయం గుర్తించాలని అన్నారు. తెలంగాణ విజన్ 2047 భారత సమ్మిట్ కార్యక్రమం నిర్వహించినప్పుడు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మాజీ సీఎం కేసీఆర్‌లను ఆహ్వానించామని అన్నారు. దేశ అభివృద్ధికి ఆయా రాష్ట్రాల ఐక్యత అవసరమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వివక్ష పూర్తికంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఏఐ సదస్సును అడ్డుకోవాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఏ కోశాన లేదని, కానీ నిన్న కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు వారి సంకుచిత బుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రపంచ దేశాల ముందు దేశ నాయకులమంతా ఒక్కటేనని చాటాల్సి ఉందని, కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతిసారి ప్రతిపక్ష నాయకులను అవవమానిస్తోందని విమర్శించారు. గణతంత్ర దినోత్సవం రోజున రాహుల్ గాంధీకి మూడో వరుసలో సీటును కేటాయించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రధానమంత్రితో సమానంగా ప్రతిపక్ష నాయకులను గౌరవించామని అన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతి విషయంలో సంకుచితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాజకీయాలు ఉంటే పార్లమెంటు వేదికగా, ఎన్నికల్లో చూసుకోవాలని, కానీ అంతర్జాతీయ సదస్సు జరిగినప్పుడు ప్రతిపక్ష నాయకుడిని పిలవకుండా దూరం పెట్టడం సరికాదని అన్నారు. ఇదెక్కడి రాజనీతి అని ప్రశ్నించారు. భారత పురాణ గాథల్లో విశాల దృక్పథం ఉంటుందని, మన ప్రభుత్వం కూడా ఆ విశాల దక్పథాన్ని చాటుకోవాలని అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని అవమానించి ఏం సాధించాలనుకుంటున్నారని ప్రశ్నించారు. సూర్యుడి మీద ఉమ్మేస్తే మీ ముఖం మీదనే పడుతుందని గుర్తించాలని అన్నారు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకిరణాలను ఆపలేరని... రాహుల్ గాంధీని మీరు ఎంత అడ్డుకుంటే ఆయన వైభవం, కీర్తి అంత ఎత్తుకు ఎదుగుతాయని అన్నారు. రాహుల్ గాంధీ పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం గాంధీలది అని తెలిపారు. ప్రపంచ దేశాల్లో గాంధీ కుటుంబం అంటే ఇండియాకు పర్యాయపదంగా ఉండేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విధానాలు మారి ప్రపంచ దేశాల ముందు భారత్ ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు.




## అగ్రి షోతో రైతులకు మేలు

### మాజీమంత్రి హరీశ్ రావు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు. ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు. ఆ సమయంలో తాను రెండు మూడు వార్తలు రాశానని, మిగతా మీడియా కూడా స్పందించి వార్తలు రాసిందని అన్నారు. వాటి ఆధారంగా హరీశ్ రావు నాగార్జున సాగర్‌ను మున్సిపాలిటీగా చేసి స్థానిక పాలన జరిగేలా చేశారని గుర్తు చేసుకున్నారు.

## డ్రిప్ ఇరిగేషన్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

గద్వాల, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): జోగులాంబ గద్వాల జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అయిజ పట్టణంలోని రాయచూర్ వెళ్లే మార్గంలో ఉన్న డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫ్యాక్టరీలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఫ్యాక్టరీలో భారీగా మంటలు ఎగిసిపడటంతో సిబ్బంది పరుగులు తీశారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో సమీపంలోని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన ప్లాస్టిక్ డ్రిప్ పైపులు, ముడిసరుకు, యంత్రాలు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి.

## కొండాపూర్‌లో హైడ్రా ఆపరేషన్

### రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ

కొండాపూర్–హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ. 1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి. ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

## కాటిపెల్లి వర్సెస్ షబ్బీర్ అలీ

### ఇరువురి సవాళ్లు, ప్రతి సవాళ్లు.. ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి కాంగ్రెస్ ప్రయత్నం

### అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు

కామారెడ్డి, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): బీజేపీకి చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్ రెడ్డి కామారెడ్డిలోని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. కాటిపల్లి వెంకటరమణారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యేకు మద్దతుగా బీజేపీ కార్యకర్తలు తరలి వచ్చారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మహేందర్ రెడ్డి కారును బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా వెంకటరమణారెడ్డి, షబ్బీర్ అలీలు కామారెడ్డి అభివృద్ధి, అవినీతిపై సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడంతో, తాను చర్చకు సిద్ధమని కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రకటించారు. కామారెడ్డిలో ఏం జరిగిందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకే తాను చర్చకు వస్తానని చెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

## కామారెడ్డిలో ఇక సినిమా చూపిస్తాం

### కాటిపల్లి వెంకటరమణారెడ్డి హెచ్చరిక

కామారెడ్డి, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): రేపటి నుంచి ఇక నుంచి యుద్ధ వాతావరణమేనని, వదిలిపెట్టే ప్రసక్తి లేదని కామారెడ్డి బీజేపీ శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి హెచ్చరిక జారీ చేశారు. కామారెడ్డికి ఏ ఇన్‌ఛార్జ్ మంత్రి వచ్చినా తాము నిలదీస్తూనే ఉంటామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రజాపాలన ఇదేనా అని నిలదీశారు. సీఎంకు సమాధానం చెప్పే పాలన ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందన్నారు. ఇష్టారీతిన మాట్లాడితే ఈరోజు ఏం జరిగిందో చూశారని అన్నారు. కామారెడ్డిలో ఈరోజు జరిగింది జస్ట్ ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు మర్యాదగా ప్రవర్తిస్తే మేం మర్యాదగా ఉంటామని లేదంటే మేం అలాగే స్పందిస్తామని స్పష్టం చేశారు. కామారెడ్డిలో ఉదయం ఘర్షణ వాతావరణం ఉన్న సమయంలో తమ కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరానని, ఎవరూ ఇక్కడకు రావొద్దని సూచించానని వెల్లడించారు. అదే తాను పిలిస్తే వేల మంది వచ్చేవారని, అప్పుడు పరిస్థితి ఉద్రిక్తంగా మారేదని తెలిపారు. అవినీతి ఆరోపణలపై నిరూపించాలని తాను సవాల్ చేశానని అన్నారు. నేను తప్పు చేస్తే తనను కాంగ్రెస్ నాయకులు చెప్పుతో కొట్టవచ్చని, కానీ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే వారికి ఏ శిక్ష విధించాలో వారే చెప్పాలని అన్నారు. అవినీతి ఆరోపణలు నిరూపించడానికి తనపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకుడు, తాను, అధికారులు మాత్రమే రావాలని చెప్పానని, కానీ కాంగ్రెస్ కార్యకర్తలు ఎందుకు తరలి వచ్చారని ప్రశ్నించారు. వేలాదిమంది తరలి వచ్చి ఏం చేయాలనుకున్నారని ప్రశ్నించారు.

### కాటిపల్లి ఇంటిపై కాంగ్రెస్ గూండాయిజం: ఈటల రాజేందర్

కామారెడ్డి బీజేపీ శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఖండించారు. వెంకటరమణారెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఎమ్మెల్యే నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిపై స్పందించారు. ఒక ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ పార్టీ దాడి చేసి గూండాయిజం చేస్తోందని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రభుత్వం ఇక సామాన్య ప్రజలకు ఏం రక్షణ ఇస్తుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించరని, హింసను క్షమించరని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఓడించారని, ఆ తర్వాత అక్కడ బీజేపీ క్రమంగా మరింత బలపడుతోందని, దీనిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ శ్రేణులు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అల్లర్లకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు.



# హెల్త్ వర్కర్లను ఆదుకోవాలి

**ఐఎఫ్ఎంఐఎస్ అమలు చేయాలి**

**మంత్రి రాజనర్సింహకు 'ఎస్పీఎస్' వినతి**

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): రాష్ట్రంలోని 33 ప్రభుత్వ ఆస్పత్రుల్లో థర్డ్ పార్టీ (బెడ్ సైడ్ కాంటాక్ట్) పద్ధతిలో పనిచేస్తున్న హెల్త్ వర్కర్లను ఆదుకోవాలని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్లు (ఎస్పీఎస్) మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. శనివారం ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మంత్రిని కలిసి తమ సమస్యలను తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 17 వేల పైచిలుకు కార్మికులకు ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) ద్వారా జీతాలు అమలు చేయాలని విన్నవించారు. రూ.26,000 కనీస వేతనాన్ని అమలు చేయాలని కోరారు. తమ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కుర్రి సైదయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేశ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సహాయ కార్యదర్శి, ఉబ్బని రమ, కే ఆనంద్, పత్తిపాటి శ్రీనివాస్, మాతంగి అనిల్ కుమార్, గొర్రె నాగరాజు, ఎంవీ రమణ, జీ కుమారి తదితరులు ఉన్నారు.




# తక్షణమే నర్సింగ్ ఎన్నికలు నిర్వహించాలి

**రాష్ట్ర అధ్యక్షుడు నక్క సూర్య కుమార్ డిమాండ్**

సుల్తాన్‌బజార్-హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ మండలి ఎన్నికలను తక్షణం నిర్వహించాలని నర్సులు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క సూర్యకుమార్ ఆధ్వర్యంలో నర్సులు డీఎంఈని కలిసి ఎన్నికల నిర్వహణపై వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ. ఎన్నికల గెజిట్ ప్రకటన వెలువడినప్పటికీ ఇప్పటివరకు ఎన్నికల ప్రకటన జారీ కాలేదని తెలిపారు. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల నర్సులకు ప్రజాస్వామ్య ప్రాతినిథ్యం లేకుండా పోయిందని, విధాన నిర్ణయాలలో నర్సుల స్వరం వినిపించడం లేదని అన్నారు. డీఎంఈని కలిసిన వారిలో అడవెల్లి సురేష్, రాంబాబు, అభిశక్తి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## జేఎన్‌జే ఎన్నికల్లో గుర్తుల కేటాయింపు



బషీర్‌బాగ్-హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ బోర్డు డైరెక్టర్ ఎన్నికల్లో అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఈ మేరకు శనివారం నామినేషన్ గడువు ముగిసిన అనంతరం గుర్తులు కేటాయిస్తూ ఎన్నికల అధికారి ఏ వెంకట్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కగినికర్ శ్రీకాంత్ రావుకు అల్మారా, మంజులారెడ్డికి బెల్, సాగర్ కుమార్‌కు బకెట్ గుర్తును కేటాయించినట్లు ఆయన తెలిపారు. డైరెక్టర్ పదవికి మార్చి 1న ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

## మైక్రో ఫైనాన్స్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): మైక్రో ఫైనాన్స్ వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్కం రాజశేఖర్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా మైక్రో ఫైనాన్స్ వేధింపులతో భార్య లత బంగారం కుదరపెట్టిన రాజశేఖర్.. వేధింపులు ఎక్కువవడంతో మనస్తాపానికి గురయ్యాడు. భార్య కూడా ఇంటిని వదిలి వెళ్లడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. దీంతో సెల్ఫీ వీడియో తీస్తూ ఉరి వేసుకున్నాడు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## చంద్రమోహన్ స్మారక విద్యా పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం




వసుంధర విజ్ఞాన వికాస మండలిలో పనిచేస్తూ అకాలమరణం పొందిన ఉపాధ్యాయుడు బామండ్లపల్లి చంద్రమోహన్ పేరుమీదా గత కొన్నేండ్లుగా ఇస్తున్న బామండ్లపల్లి చంద్రమోహన్ స్మారక విద్యాపురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. విద్యారంగంలో రాణిస్తూ విద్యావ్యవస్థలో సమూల మార్పులు, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడం, విద్యారంగంలో నూతన ప్రయోగాలు చేస్తున్నవారి నుంచి దరఖాస్తులు కోరుతున్నాము. దరఖాస్తుదారులు విద్యారంగంలో పనిచేసినవారు, చేస్తున్నవారైన ఉపాధ్యాయులు ఇతర విద్యారంగాలకు చెందినవారై ఉండాలి. దరఖాస్తులు మాకు చేరాల్సిన చివరితేది 25 ఫిబ్రవరి 2026. దరఖాస్తులు పంపాల్సిన చిరునామా- కన్వీనర్, వసుంధర విజ్ఞాన వికాస మండలి (రిజిస్టర్డ్), ఇ,నెం- : 13-3/3/6/2జు, అవంతినగర్ తోట, మోతీనగర్, హైదరాబాద్ - 500018. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 8096677409.

## సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ నిరసన: జగన్

తాడేపల్లి, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): ఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎగ్జిబిషన్ హాల్ నంబర్-5 వద్ద నిరసనకు దిగారు. పదుల సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు హఠాత్తుగా టీ-షర్టులు విప్పేసి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి టీ-షర్టులపై 'ఎప్‌స్టీన్స్ ఫైల్స్', 'మోదీ రాజీపడ్డారు' వంటి వాక్యాలు, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి. సదస్సుకు హాజరైన కొందరు ప్రతినిధులు నిరసనకారులను ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. వెంటనే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని నిరసనకారులను అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటన సదస్సు ప్రాంగణంలో కలకలం రేపింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఏఐ సమ్మిట్ లో సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని మండిపడ్డారు. మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. మన దేశాన్ని ఎవరూ, ఎప్పుడూ కించపరచకూడదని చెప్పారు. మన మధ్య ఎలాంటి రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ... ప్రపంచం ముందు అందరం ఐక్యంగా ఉండాలని అన్నారు.

## ఏఐని అదుపులో పెట్టాలి: వెంకయ్య నాయుడు

విజయవాడ, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యానాయుడు అభిప్రాయపడ్డారు.

# పకడ్బందీగా ధర్మపురి నర్సన్న బ్రహ్మోత్సవాలు

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి**



ధర్మపురి, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉత్సవాల సమయంలో భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఏర్పాట్ల అనుభవాలు, ప్రస్తుతం చేస్తున్న ఏర్పాట్ల గురించి శాఖలవారీగా సమాచారం తెలుసుకున్నారు. తాగునీరు, శుద్ధమైన ఆహారం, వైద్యసేవలు, పారిశుధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక వైద్యశిబిరాలు, అంబులెన్స్ సదుపాయాలు 24 గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి వారికి సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు పారదర్శకంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. గోదావరి నదిలో బ్రహ్మ, సత్యవతి గుండాలు ఉన్నందున భక్తులు పుణ్యస్నానాలు చేసేటప్పుడు లోతు ప్రదేశాలకు వెళ్ళకూడదని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే 45 మంది గజ ఈతగాళ్ళకు రేడియంతో గల టీ- షర్ట్స్ అందుబాటులో ఉంచుతూ 3 షిఫ్ట్ లలో పహారా కాయాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించి గోడపత్రిక, ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జిల్లా అధికారులు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వీ నాగలక్ష్మి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం చైర్మన్ జే రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, దేవస్థానం కమిటీ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెను మార్పులు తెస్తాం: చంద్రబాబు



వినుకొండ, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): పేద ప్రజల ఆదాయాన్ని పెంచి, వారి జీవితాల్లో ఆనందం నింపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శనివారం పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన "స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యర్థాల సేకరణ కోసం వినియోగించే స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని ప్రశంసించారు. స్వచ్ఛత అనేది కేవలం రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదని, అది మన జీవన విధానంలో భాగం కావాలని ఉద్బోధించారు. రాబోయే రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో పెనుమార్పులు తీసుకురాబోతోందని చంద్రబాబు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నామని, ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేదని ధీమా వ్యక్తం చేశారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2.0, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పేరుకుపోయిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఏర్పడిందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగుతోందని, వచ్చే మార్చి నెలాఖరుకల్లా రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో 100 శాతం చెత్త సేకరణ పూర్తి చేస్తామని ప్రకటించారు. రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరులో రూ.1,254 కోట్లతో నిర్మిస్తున్న 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'ను మార్చి 15 నాటికి వినియోగంలోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, చెత్త నిర్వహణపై ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని సూచించారు. జపాన్‌లో రోడ్లపై చిన్న కాగితం ముక్క కూడా కనిపించదని, అక్కడి పౌరుల తరహాలో మనమూ అలవాట్లు మార్చుకోవాలని కోరారు. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ సదస్సు గురించి ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ తీరుపై సీఎం తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "ప్రపంచంలోని పెద్ద కంపెనీలు, 60 దేశాల ప్రతినిధులు హాజరైన సదస్సులో.. యువత ప్రయోజనాలు కాపాడాల్సిన పార్టీలు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం నన్ను తీవ్రంగా బాధించింది. ఈ తరహా రాజకీయాలు దేశానికి నష్టం చేస్తాయి" అని ఆయన అన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, పారిశ్రామికవేత్తలు పారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆ అరాచక పాలనకు వ్యతిరేకంగా కూటమికి గొప్ప విజయాన్ని అందించారని తెలిపారు.

# కొణిదెల గ్రామానికి మహర్దశ

**రూ. 50 లక్షల విరాళంతో 90,000 లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు**

నంద్యాల, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామాభివృద్ధికి నడుం బిగించిన పవన్, తన వ్యక్తిగత విరాళంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఆయన అందించిన రూ. 50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామస్థుల దశాబ్దాల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. 2019 ఎన్నికల ప్రచార సమయంలో తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం, గత ఏడాది నియోజకవర్గ పర్యటనలో రూ. 50 లక్షల విరాళం అందజేశారు. గ్రామస్థుల ప్రధాన సమస్య అయిన తాగునీటి ఎద్దడిని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆ నిధులతో 90,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించాలని సూచించారు. ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోని సుమారు 2,000 మందికి రక్షిత తాగునీరు అందనుంది. వేసవికి ముందే నిర్మాణం పూర్తి కావడం పట్ల పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ, అధికారులను అభినందించినట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ ట్యాంకుతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులను గ్రామానికి మళ్లించారు. 'పల్లెపండగ 1.0' కింద రూ. 20 లక్షలతో మూడు అంతర్గత రహదారులు పూర్తి కాగా, 'పల్లెపండగ 2.0'లో రూ. 45 లక్షలతో ఏడు సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ కింద కొణిదెల జిల్లా పరిషత్ స్కూల్ నుంచి లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గ్రామానికి రహదారి పునరుద్ధరణకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు.

## జగన్‌పై కుట్ర: మల్లాది విష్ణు

విజయవాడ, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారని, రాష్ట్రానికి పెద్దగా, బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి స్థానానికి ఇది తగదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ సిట్ చార్జ్ షీట్ లో తెలిపిందని విష్ణు అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసేందుకు కుట్ర పన్నారని... సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లడం మానుకోలేదని దుయ్యబట్టారు. నెయ్యి వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని... వారికి తగ్గట్టుగానే రిపోర్టు ఇస్తుందని అన్నారు. శాసనమండలిలో ఇందాపూర్, భోలేబాబా, హెరిటేజ్‌పై చర్చకు వైసీపీ తీర్మానం ఇచ్చినా కూటమి ప్రభుత్వం ఎందుకు తోక ముడిచిందో సమాధానం చెప్పాలని విష్ణు డిమాండ్ చేశారు.

## పీఎస్ఎల్వీ వైఫల్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇటీవల చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం విఫలం కావడంపై కేంద్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానికి గతంలో ముఖ్య శాస్త్రీయ సలహాదారుగా పనిచేసిన కె. విజయరాఘవన్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ కో-ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ఏడాది జనవరి 12న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. అయితే, మూడో దశ సాలిడ్ మోటారులో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది. ఈ ఘటనలో డీఆర్‌డీఓకు చెందిన కీలకమైన 'అన్వేష' ఉపగ్రహంతో పాటు మొత్తం 16 ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరలేదు. పీఎస్ఎల్వీ రాకెట్ వరుసగా రెండోసారి విఫలం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. గతంలో 2025 మే నెలలో ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ61 కూడా దాదాపు ఇలాంటి కారణాలతోనే విఫలమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా వైఫల్యంపై దర్యాప్తునకు ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ సభ్యులు ఇప్పటికే శ్రీహరికోటలోని షార్ కేంద్రాన్ని, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌ను సందర్శించి విచారణ ప్రారంభించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాలపై ఇస్రో నిర్ణయం తీసుకోనుంది.

## తిరుమలలో పోటెత్తిన భక్తులు

తిరుమల, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10-12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు

మంగళగిరి, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు.

# ఫాంహౌస్‌లు కట్టాలంటే పర్మిషన్

## కొత్త పాలసీపై రేవంత్ రెడ్డి సర్కార్ ప్లాన్



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఈవార్తలు): ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, జనాల రద్దీ, పొల్యూషన్ తట్టుకోలేక.. వీకెండ్, సెలవులు వచ్చాయంటే చాలు.. నగరవాసులు నగరం బయటికి వెళ్లి ఫాంహౌస్‌లలో సేద తీరుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. కొన్ని చాలా ఏళ్ల క్రితమే నిర్మితం కాగా.. మరికొన్ని ఇటీవలి కాలంలో పుట్టుకొచ్చాయి. అయితే మన రాష్ట్రంలో ఫాంహౌస్‌ల నిర్మాణానికి పర్మిషన్లు, విధి విధానాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ఈ నేపథ్యంలోనే దీనిపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఫాంహౌస్ నిర్మాణాలకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఫాంహౌస్‌లను నిర్మించుకునేందుకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో అడ్డగోలుగా నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సమగ్ర ఫాంహౌస్ పాలసీని తీసుకువచ్చి.. వాటిపై నియంత్రణ తీసుకురావడంతో పాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలు, ఫీజులు, అభివృద్ధి ఛార్జీలపై సంబంధిత అధికారులు కసరత్తులు ప్రారంభించారు. జోన్ పరిమితులు లేకుండా.. కన్వర్షన్, బయో కన్వర్షన్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్లలో కూడా ఫాంహౌస్‌లకు అనుమతులు ఇవ్వాలని రేవంత్ సర్కార్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి.. ఆ తర్వాత వీటికి సంబంధించి విధివిధానాలను ఫైనల్ చేయనున్నారు. ఈ ఫాంహౌస్ పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్మాణం, అభివృద్ధి ఫీజుల రూపంలో ఆదాయం పెరగనుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కరోనా మహమ్మారి తర్వాత ఫాంహౌస్‌లకు వెళ్లడంపై మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి కుటుంబాలు బాగా ఆసక్తి చూపిస్తున్నాయి. వీకెండ్ సేద తీరేందుకు ఫాంహౌస్‌లను వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. అయితే ప్రస్తుతం 100, 200 గజాల్లో కూడా ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇలా చిన్న చిన్న స్థలాల్లో ఫాంహౌస్ నిర్మించి.. ఆ భూములను గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ అక్రమాలకు తెరతీస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతుల వ్యవస్థ స్పష్టంగా లేకపోవడంతో బిల్డర్లు ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నగరం బయట మొయినాబాద్, చేవెళ్ల, శంషాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో భారీగా ఫాంహౌస్ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. చట్టపరంగా మాత్రం ఆ భూములు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే పరిగణించడం గమనార్హం. కొత్తగా తీసుకొచ్చే పాలసీ ప్రకారం తక్కువలో తక్కువగా ఫాంహౌస్ నిర్మించాలంటే 1,200 చదరపు గజాల స్థలం ఉండాలి. ఆ ఫాంహౌస్‌కు కనీసం 30 అడుగుల వెడల్పైన రోడ్డు తప్పనిసరిగా ఉండాలి. మొత్తం స్థలంలో కేవలం 20 శాతం మాత్రమే కాంక్రీట్ నిర్మాణానికి అనుమతి ఉంటుంది. 1,200 చదరపు గజాల స్థలంలో 240 గజాల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ బిల్డింగ్ నిర్మించవచ్చు. మిగిలిన భూమిని పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ఉపయోగించాలి. భవనం ఎత్తు 6 మీటర్లకు మించకూడదు. ఫాంహౌస్‌లు నిర్మించడం చట్టబద్ధం చేయడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే ఈ కొత్త పాలసీ లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది.



# పసిగుడ్డు ఊపిరి తీశారు!

## ఆలయంలో గొడవ, కులదూషణ!.. నాగర్ కర్నూల్ జిల్లాలో దారుణం



నాగర్ కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల శిశువు మరణం కలకలం రేపింది. శనివారం ఉదయం శిశువు మరణించడంతో గ్రామంలో ఉద్రిక్తత మరింత పెరిగింది. రెండు వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు సందేహాస్పద మరణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులకిచ్చిన ఫిర్యాదు ప్రకారం, బీసీ రజక సామాజిక వర్గానికి చెందిన సి. చంద్రకళ కుటుంబం బుధవారం కుమ్మెర మల్లికార్జున స్వామి ఆలయంలో దర్శనం కోసం వెళ్లగా, ఆలయంలో శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి కులం పేరుతో దూషిస్తూ వంద రూపాయల దర్శనం టికెట్ కొనాలని ఒత్తిడి చేశారని చంద్రకళ ఆరోపించారు. ఆయనతో పాటు ఎస్ మధు, శ్రీకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు తమ కుటుంబ సభ్యులపై దాడి చేసి బెదిరింపులకు దిగారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కొడుకు గణేష్ అడ్డుకోగా అతడిని తోసేసి, కొబ్బరి పీచు తీసే సాధనంతో దాడి చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఆ సమయంలో తనను, కొడుకును కొట్టి బంగారు ఆభరణాలు లాగేసుకున్నారని, గ్రామంలో ఉండకూడదని, ఇంటిని బుల్డోజర్‌తో కూల్చేస్తామని బెదిరించారని ఆరోపించారు. ఘటన అనంతరం పాపను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా శనివారం ఉదయం మరణించింది. ఈ ఆరోపణలను కుమ్మెర సర్పంచ్ తుకారాం రెడ్డి ఖండించారు. దర్శనానికి ఎలాంటి టికెట్ వ్యవస్థ లేదని స్పష్టం చేశారు. శ్రీనివాస్ రెడ్డి గణేష్‌ను ఒక్కసారి కొట్టగా, అనంతరం చంద్రకళ కుటుంబసభ్యులే రాళ్లతో దాడి చేసి అతడిని తీవ్రంగా గాయపరిచారని చెప్పారు. శిశువుపై దాడి జరిగిందన్న విషయం సంఘటనా సమయంలో ఎవరూ ప్రస్తావించలేదని పేర్కొన్నారు. పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ మాట్లాడుతూ, ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని, సందేహాస్పద మరణం కింద కేసు నమోదు చేశామని తెలిపారు. శిశువుకు బాహ్య లేదా అంతర్గత గాయాలు ఉన్నాయా అనేది పోస్ట్‌మార్టం నివేదిక ద్వారా తెలుతుందని చెప్పారు. నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై బీసీ సంఘాలు, ఇతర సంస్థలు ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టి న్యాయం కోరాయి. కాగా, ఈ సంఘటన రాజకీయ రంగు పులుముకోవడంతో వివాదం మరో మలుపు తిరిగింది.



## సీఆర్పీఎఫ్ వల్లే మావోయిస్టుల అంతం

### కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడి

గౌహతి: నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని, కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

## 27 నుంచి ఇస్రో 'యువికా' రిజిస్ట్రేషన్లు

ఇస్రో ఏటా నిర్వహిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం 'యువికా-2026' రిజిస్ట్రేషన్ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు (గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రాధాన్యం) అర్హులు. గ్రామీణ యువతలో సైన్స్, స్పేస్ టెక్నాలజీపై ఆసక్తి పెంచడమే లక్ష్యం. స్పేస్ సైన్స్, రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ టెక్నాలజీలపై ప్రాథమిక జ్ఞానం అందిస్తారు. మే నెలలో 2 వారాల పాటు రెసిడెన్షియల్ (హాస్టల్‌లో ఉండి) శిక్షణ ఇస్తారు. ఇస్రో సెంటర్లలో ప్రాక్టికల్ సెషన్లు, ప్రాజెక్టులు, ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయి. గ్రామీణ విద్యార్థులకు ఇస్రో సైంటిస్టులతో డైరెక్ట్ ఇంటరాక్షన్, ల్యాబ్ విజిట్లు, స్పేస్ టెక్ ప్రాజెక్టులు చేసే అవకాశం ఉంటుంది. ఇది సైన్స్‌లో కెరీర్ ఆసక్తి ఉన్న విద్యార్థులకు బెస్ట్ అవకాశం.

## ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయం, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేవాలయాల సమీపంలో పేలుళ్లు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ప్లాన్ చేస్తోందని సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో ఫిబ్రవరి 6న జరిగిన పేలుడుకు ప్రతీకారంగా ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ద్వారా దాడికి కుట్ర పన్నుతున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న ఇస్లామాబాద్‌లోని మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భద్రతా బలగాలు వెల్లడించాయి.

# బుద్ధుందా.. ఇదేం పని?

## ఏఐ సదస్సులో నిరసనలపై కాంగ్రెస్ మిత్రపక్షాలు.. సిగ్గులేని చర్య అంటూ బీజేపీ మండిపాటు



న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పి చేసిన నిరసన రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. ఈ ఆందోళనపై కేవలం బీజేపీ నుంచే కాకుండా, ఇండియా కూటమిలోని కాంగ్రెస్ మిత్రపక్షాలైన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీల నుంచి కూడా విమర్శలు వ్యక్తమవడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం భారత్ మండపంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనపై తీవ్ర విమర్శలు రావడంతో యూత్ కాంగ్రెస్ తన చర్యను సమర్థించుకుంది. మహాత్మా గాంధీ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, "మేం గాంధీజీ వారసులం, చొక్కాలు లేకపోతేనేం" అని వ్యాఖ్యానించింది. అయితే, ఈ నిరసన తీరును కాంగ్రెస్ మిత్రపక్షాలు తప్పుపట్టాయి. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి ఆందోళనలు చేయడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డాయి. ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా మాట్లాడుతూ, "నిరసన తెలిపేందుకు వేరే మార్గాలున్నాయి. ఆందోళన చేసే వేదిక సరైనది కాదు" అని అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి ఫక్రుల్ హసన్ చాంద్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. సరైన సమయంలో, సరైన వేదికపై నిరసన తెలపాలని సూచించారు. మరోవైపు, బీజేపీ నేతలు ఈ నిరసనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది సిగ్గులేని చర్య అని, అంతర్జాతీయ ప్రతినిధుల ముందు దేశ పరువు తీసే ప్రయత్నమని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ విమర్శించారు. కొందరు బీజేపీ నేతలు ఈ ఘటనను గతంలో జేఎన్‌యూలో జరిగిన నిరసనలతో పోల్చుతూ, ఇది దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే కుట్ర అని ఆరోపించారు. మొత్తం మీద, యూత్ కాంగ్రెస్ నిరసన సొంత మిత్రుల నుంచే విమర్శలు ఎదుర్కోవడంతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడింది.

# న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

### ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026



న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు.

**ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.**

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత
6. మానవ వనరుల అభివృద్ధి
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు

# టార్గెట్.. ఇండియన్ క్లబ్బులు, బార్లు

### యువతులతో దాడికి జైషే కుట్రలు

### ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులకు ప్లాన్



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది. ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.

## ది కేరళ స్టోరీ 2ని వ్యతిరేకిస్తూ బీఫ్‌తో నిరసన

తిరువనంతపురం: 'ది కేరళ స్టోరీ 2' సినిమా ఇంకా రిలీజ్ కాకముందే కేరళలో వివాదం రాజేస్తోంది. ఫిబ్రవరి 27న విడుదల కానున్న ఈ చిత్రం మతమార్పిడి, లవ్ జిహాద్ అంశాల చుట్టూ తిరుగుతుందని డైరెక్టర్ కామాఖ్య నారాయణ్ సింగ్ చెప్పారు. మరోవైపు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ నేతలు ఈ సినిమాపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సీపీఎం యువజన విభాగం డీవైఎఫ్ఐ, స్టూడెంట్ వింగ్ ఎస్ఎఫ్ఐ కేరళ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. తిరువనంతపురంలో బీఫ్ ఫెస్టివల్ నిర్వహించారు. పరాటా, గొడ్డుమాంసం కూరను వడ్డిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు సీఎం పినరయి విజయన్ ఇటీవల స్పందిస్తూ... "ఈ సినిమా కేరళ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. రాష్ట్రాన్ని ఉగ్రవాద కేంద్రంగా చూపే ప్రయత్నం జరుగుతోంది. లౌకికవాదాన్ని, శాంతిని దెబ్బతీసేందుకు రూపొందించిన విద్వేషపూరిత ప్రచారం ఇది. కేరళలో ఇలాంటివి జరగవు. ప్రజలు సమష్టిగా ఈ సినిమాను తిరస్కరించాలి" అని అన్నారు. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ఈ సినిమాపై విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ... "కేరళలో ప్రజలు గొడ్డు మాంసం తినాల్సి వస్తుందని తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారు. మతపరంగా ప్రజల్ని విభజించే ప్రయత్నం ఇది" అని విమర్శించారు.



## భీవండి కోర్టులో రాహుల్‌కు ఊరట

భీవండి: 2014 నాటి పరువు నష్టం కేసులో మహారాష్ట్రలోని భీవండి కోర్టులో లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆరెస్సెస్‌పై నాడు చేసిన వ్యాఖ్యలకు గాను ఆయనపై మహారాష్ట్రలో కేసు నమోదైంది. ఈ కేసుపై కోర్టులో జరిగిన విచారణకు రాహుల్ గాంధీ ఈరోజు హాజరుకాగా, బెయిల్ లభించింది. 2014 లోక్ సభ ఎన్నికల సమయంలో మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో ఆరెస్సెస్‌పై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆరెస్సెస్ హస్తం ఉందని అన్నారు. అయితే రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఆరెస్సెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంటూ ఆరెస్సెస్ కార్యకర్త రాజేశ్ కోర్టులో ఫిర్యాదు చేశారు.

## దేశంలోనే ఫాస్టెస్ట్ మెట్రో

### మీరట్‌లో సరికొత్త రికార్డు!

మీరట్: ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.



## వయ్యారి చిత్రం



ప్రగ్యా జైస్వాల్

# బాడీ సూట్‌లో జెన్నిఫర్ లోపేజ్




56 ఏళ్ల వయసులోనూ తన స్టేజ్ పెర్ఫార్మెన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపుతున్నారు జెన్నిఫర్ లోపేజ్. అంబానీల పెళ్లి వేడుకలో పాల్గొని షోస్టాపర్ గా నిలిచింది. ఇప్పుడు కొత్త పాట –సేవ్ మీ టునైట్– తో మరోసారి అభిమానులకు స్పెషల్ ట్రీట్ ని ప్లాన్ చేసారు. ప్రముఖ ఫ్రెంచ్ డీజే, మ్యూజిక్ ప్రొడ్యూసర్ డేవిడ్ గ్వెట్టా కలిసి చేసిన కొత్త సాంగ్ ఇది. మార్చి 6న ఈ పాట విడుదల కానుండగా జెలో స్టేజీ పెర్ఫామెన్స్ హాట్ టాపిగ్గా మారింది. జెన్నిఫర్ తన ఇన్‌స్టాలో ఒక పవర్‌ఫుల్ వీడియోను షేర్ చేస్తూ ఈ తేదీని ప్రకటించారు. ఆ వీడియోలో మెరిసే సిల్వర్ బాడీసూట్ ధరించి డ్యాన్స్ చేస్తూ కనిపించారు. వీడియోలు, ఫోటోలు వెబ్ లో సునామీ స్పీడ్ తో దూసుకుపోతున్నాయి.




# విశ్వక్ 'కల్ట్' టీజర్ రిలీజ్


యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం కల్ట్ టీజర్ విడుదలై ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అందరినీ ఆకట్టుకుంటూ మెప్పిస్తోంది. రా, బ్లడీ, స్టైలిష్ విజువల్స్ తో కల్ట్ టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే దర్శకుడిగా ఫలక్ నామా దాస్, దాస్ కా ధమ్కీ చిత్రాలతో విశ్వక్ మాస్ టచ్ చూపించారు. ఆ సినిమాలు ప్రత్యేకమైన కల్ట్ ఫాలోయింగ్ తీసుకొచ్చాయి. ఇప్పుడు కల్ట్ అనే టైటిల్ కే తగ్గట్టు, ఈసారి మరింత బోల్డ్ కాన్సెప్ట్ తో ప్రేక్షకులను సర్ప్రైజ్ చేయాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఇప్పుడు టీజర్ ను తీసుకొచ్చారు. హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రానున్న కల్ట్ మూవీని నిర్మాత సందీప్ కాకర్ల నిర్మిస్తున్నారు. రిచ్ వాల్యూస్ తో రూపొందిస్తున్నారు. ముఖ్యంగా సంగీత దర్శకుడు రవి బస్రూర్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మెయిన్ అసెట్ గా మారింది. ఆయన మ్యూజిక్ సీన్స్ కు థ్రిల్ యాడ్ చేసింది. ఏదేమైనా కల్ట్ నార్మల్ కమర్షియల్ మూవీ కాదని టీజర్ స్పష్టంగా చెబుతోంది.



# ఇక చూసుకుందాం: హరీశ్ శంకర్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా మార్చి 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్లలో వేగం పెంచింది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'దేఖ్లేంగే సాలా' పాట బ్లాక్ బస్టర్ హిట్ అయింది. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే సెకండ్ సాంగ్ ప్రోమోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఫిబ్రవరి 22వ తేదీన పూర్తి పాటను విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో సినిమా దర్శకుడు హరీశ్ శంకర్ ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. 'రేసు చూసుకుందాం.. ఐ మీన్.. రేపు కలుసుకుందాం..' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. దీంతో ఇది వైరల్‌గా మారింది. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. శ్రీలీల, రాశిఖన్నా హీరోయిన్లుగా నటించారు. తమిళ అగ్ర కథానాయకుడు పార్థిబన్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రవికుమార్, ఎల్బీ శ్రీరామ్, రావు రమేష్, రాంకీ, కేజీఎఫ్ అవినాష్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవి శంకర్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

# ఇంట్రెస్టింగ్‌గా టాక్సిక్ కొత్త పోస్టర్




రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న 'టాక్సిక్' సినిమా నుండి లేటెస్ట్ గా వచ్చిన ఒక పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్‌లో యశ్ ని ఒక స్టైలిష్ లుక్ లో చూసి అంతా ఫిదా అయిపోయారు. అయితే ఇప్పుడు మేకర్స్ కంప్లీట్ మాస్ అండ్ బ్లడీ లుక్ తో ఉన్న యశ్ రెండో అవతార్ ను రివీల్ చేసి అందరికీ షాక్ ఇచ్చారు. ఈ పాత్ర పేరు 'టికెట్' అని ప్రత్యేకంగా అనౌన్స్ చేయడంతో ఇప్పుడు నెట్టింట దీని గురించే పెద్ద చర్చ నడుస్తోంది. నిజానికి సినిమా టీజర్ వచ్చినప్పుడు యశ్ రెండు రకాల గెటప్స్ లో కనిపిస్తారేమో అని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు మేకర్స్ ఇది కేవలం ఒక గెటప్ మార్పు మాత్రమే కాదు, ఇదొక ప్రత్యేకమైన క్యారెక్టర్ అని హింట్ ఇవ్వడంతో అంచనాలు మారిపోయాయి. దీంతో ఈ సినిమాలో యశ్ డ్యూయల్ రోల్ లో నటిస్తున్నారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. యశ్ కొడుకుగా ఈ 'టికెట్' పాత్రలో కనిపిస్తారా లేదంటే బ్రదర్ గా మరో రోల్ లో షాక్ ఇస్తారా అనేది ఇప్పుడు మిస్టరీగా మారింది.

# బాలీవుడ్ గెంటేసింది




ప్రియాంక చోప్రా అంటే ఒకప్పుడు బాలీవుడ్ బాక్సాఫీస్ క్వీన్. కానీ, హాలీవుడ్ ప్రయాణం గురించి ఆమె మాట్లాడుతూ.. తాను కావాలని హిందీ సినిమాలను వదిలి వెళ్లలేదని స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ బాలీవుడ్‌ను వీడాలని అనుకోలేదు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల అక్కడ నాకు అవకాశాలు పరిమితం అయిపోయాయి. ఒక రకంగా చెప్పాలంటే నన్ను ఒక మూలకు నెట్టేశారు. ఒక కళాకారిణిగా నా ప్రతిభను నిరూపించుకోవడానికి కొత్త దారులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# బ్యాండ్ మేళం.. ఊర మాస్?

మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ మూవీని మార్చి 13న విడుదల చేయబోతోన్నారు. తాజాగా, ఫస్ట్ సింగిల్ 'తిప్పుకుంటన్నవ్' పాటను అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ మాస్ సాంగ్ యూట్యూబ్‌లో ఇన్ స్టంట్‌గా చార్ట్ బస్టర్ అయింది. ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్ సాహిత్యాన్ని అందించిన ఈ పాటలో శ్రీదేవీ, రోషన్ డ్యాన్స్ మూమెంట్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి.




# రష్మికపై కన్నడ బాబుల ఏడుపు!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వెడ్డింగ్ రాజస్థాన్ ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో అంగరంగ వైభవంగ జరుగనుందని వార్తలు షికారు చేస్తున్నాయి. ఈ సందర్భంగా రష్మిక, విజయ్ దేవరకొండ పెళ్లి గురించి కన్నడ నటుడు సెటైరికల్‌గా కౌంటర్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. కన్నడ నటుడు ఓ మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడుతూ రష్మిక, విజయ్ దేవరకొండల వివాహానికి తమని ఆహ్వానిస్తారని వేచి చూడటం లేదని, రక్షిత్ శెట్టి ప్రస్తుతం పూర్తిగా సినిమాల్లో బిజీగా ఉన్నాడని ఆసక్తికర కామెంట్‌లు చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కన్నడకు చెందిన రష్మికపై అక్కడి వారు ఎందుకు ఇలా కోపాన్ని ప్రదర్శిస్తున్నారు? అని అంతా చర్చించుకుంటున్నారు. గతంలో రష్మిక కన్నడ హీరో రక్షిత్ శెట్టిని వివాహం చేసుకోవాలనుకుంది. ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఆ ఎంగేజ్‌మెంట్‌ని రష్మిక రద్దు చేసుకుంది. అక్కడి నుంచి టాలీవుడ్‌కే పరిమితమవుతూ వస్తోంది. అంతే కాకుండా కొన్ని ఇంటర్వ్యూల్లో హైదరాబాద్ హోమ్ టౌన్ అని చెప్పడం, ఆ తరువాత కూడా కన్నడ మాట్లాడటం కాస్త కష్టంగా ఉందనడం, కాంతార సినిమా గురించి అడిగితే తాను చూడలేదని చెప్పడంతో రష్మికపై కన్నడ ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా తనని కామెంట్ చేయడం, మాతృ భాష ఇండస్ట్రీని మించి ఇతర భాషల ఇండస్ట్రీలకు ప్రాధాన్యత ఇస్తుందని, అంతే కాకుండా రక్షిత్ శెట్టితో నిశ్చితార్థం క్యాన్సిల్ చేసుకోవడం వంటి కారణాలతో రష్మికపై కన్నడ ప్రజలు ద్వేషాన్ని పెంచుకున్నారు.




# తొలి సూపర్ 8 మ్యాచ్ రద్దు

పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 ఆరంభ పోరులో విజయంపై కన్నేసిన పాకిస్థాన్, న్యూజిలాండ్‌కు బిగ్ షాక్. వర్షం కారణంగా మ్యాచ్ ఒక్కబంతి కూడా పడకుండానే రద్దయ్యింది. టాస్ పడడమే ఆలస్యం ప్రేమదాస స్టేడియాన్ని ముంచెత్తిన వర్షం.. ఎంతకూ తగ్గలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆటైనా జరిపించాలనుకున్నా సాధ్యపడలేదు. వర్షం బ్రేకివ్వకపోవడంతో నాలుగ్గంటలే వేచిచూసిన అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు. లీగ్ దశలో ఒక ఓటమితో గ్రూప్ బీలో చోటు దక్కించుకున్న పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల జట్లకు వర్షం ఊహించని షాకిచ్చింది. శనివారం ప్రేమదాస స్టేడియంలో జరగాల్సిన సూపర్ 8 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దాంతో.. విజయంతో రెండు పాయింట్లు సాధించాలనుకున్న ఇరుజట్లకు అంపైర్లు చెరొక పాయింట్ కేటాయించారు. ఊహించిని పరిణామంతో పాక్, కివీస్ ఆటగాళ్లు కంగుతిన్నారు. ప్రపంచకప్ మ్యాచ్‌కు వర్షం అడ్డుపడడం ఇది రెండోసారి. లీగ్ దశలో గ్రూప్ బీలోని ఐర్లాండ్ జింబాబ్వే మ్యాచ్‌ను అడ్డుకున్న వరుణుడు.. చివరకు ఆస్ట్రేలియా నిష్క్రమించడానికి కారణమయ్యాడు. ఈసారి సూపర్ 8లో మొదటి మ్యాచ్‌కే అంతరాయం కలిగిస్తున్నాడు. ప్రేమదాస స్టేడియంలో టాస్ గెలిచిన పాక్ సారథి సల్మాన్ అఘా బ్యాటింగ్ ఎంచుకున్న కాసేపటికే.. చినుకులు షురూ అయ్యాయి. సాయంత్రం 6:30 గంటలకు ముందు నుంచే అప్పటికే ఆకాశం మేఘావృతమై ఉండడంతో అప్రమత్తంగా ఉన్న సిబ్బంది వర్షం మొదలవ్వగానే కవర్లతో పిచ్‌ను, ఔట్‌ఫీల్డ్‌ను పూర్తిగా కప్పేశారు.




## సిరాజ్‌కు గాయం!

**టీమిండియాకు ఎదురుదెబ్బ**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో కీలకమైన సూపర్-8 దశ ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ నెట్స్‌లో గాయపడ్డాడు. సూపర్-8 దశలో సౌతాఫ్రికాతో మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్న సిరాజ్.. బౌలింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. అతను వేసిన బంతిని హార్దిక్ పాండ్యా బలంగా కొట్టాడు. అది కాస్త సిరాజ్ ఎడమ మోకాలికి బలంగా తగిలింది. దాంతో అతను నొప్పితో విలవిల్లాడిపోయాడు. ఫిజియో అతనికి సపర్యలు చేశాడు. కాసేపటికి నెట్స్ నుంచి సిరాజ్ వెళ్లిపోయాడు. దాంతో సిరాజ్ గాయంపై ఆందోళన నెలకొంది. అయితే, అతని గాయం చిన్నదేనని జట్టుకు దూరమయ్యే పెద్దది కాదని ప్రచారం జరుగుతోంది. అహ్మదాబాద్ వేదికగా ఆదివారం రాత్రి 7 గంటలకు జరిగే సూపర్-8 పోరులో సౌతాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది. డిసెంబర్ 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్‌తో తమ తదుపరి సూపర్-8 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మూడు మ్యాచ్‌ల్లో కనీసం రెండు విజయాలు సాధిస్తేనే టీమిండియా సెమీఫైనల్ చేరనుంది.



# మళ్లీ ఇంటివాడైన ధావన్

టీమిండియా మాజీ డ్యాషింగ్ ఓపెనర్ శిఖర్ ధావన్ రెండోసారి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. తన స్నేహితురాలు సోఫీ షైన్‌ను వివాహమాడాడు. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య శనివారం ఈ పెళ్లి వేడుక జరిగినట్లు తెలుస్తోంది. భారత స్పిన్నర్, ధావన్ స్నేహితుడు యుజ్వేంద్ర చాహల్ ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరుడి సంప్రదాయ దుస్తుల్లో ఉన్న ధావన్, వధువుగా ముస్తాబైన సోఫీతో కలిసి దిగిన ఫొటోలను చాహల్ షేర్ చేశాడు. "మేరే యార్ కీ షాదీ హై" (నా స్నేహితుడి పెళ్లి) అనే క్యాప్షన్‌తో తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వేడుకలో ఇతర అతిథులతో కలిసి చాహల్ డ్యాన్స్ చేస్తూ సందడి చేస్తున్న దృశ్యాలు కూడా ఈ ఫొటోల్లో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ధావన్, సోఫీ.. 2025లో తమ సంబంధాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో వీరి నిశ్చితార్థం జరిగింది. సోషల్ మీడియాలో ఈ జంట చేసే సరదా రీల్స్‌కు అభిమానుల్లో మంచి ఆదరణ ఉంది. ఇటీవలే ధావన్ తన సంగీత్ కార్యక్రమ ఫొటోలను, సోఫీ తన హల్దీ వేడుక ఫొటోలను పంచుకున్నాడు. ధావన్‌కు ఇది రెండో వివాహం. మొదటి భార్య అయేషా ముఖర్జీతో 2021లో విడాకులు తీసుకున్నాడు. 2024 ఆగస్టు 24న ధావన్ అన్ని రకాల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన కెరీర్‌లో 269 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 24 సెంచరీలతో 10,867 పరుగులు సాధించాడు. ఐసీసీ టోర్నమెంట్లలో నిలకడగా రాణించడంతో అతనికి 'మిస్టర్ ఐసీసీ' అనే పేరుంది.



# సూపర్ 8లోనూ శాంసన్ బెంచ్ మీదే!

భారత జట్టుకు ఆడాలంటే ప్రతిభకు కొదవ లేకున్నా.. అవకాశాల్ని ఉపయోగించుకోగల నేర్పు ఉండాలి. ద్వైపాక్షిక సిరీస్‌లో, ఐపీఎల్‌లో దంచేసే సంజూ శాంసన్ కు ఈ మాట నూరు శాతం వర్తిస్తుంది. టీ20ల్లో మూడు సెంచరీలు బాదిన శాంసన్ వరల్డ్‌కప్‌లో బెంచ్‌కే పరిమితమవుతున్నాడు. సూపర్ 8లోనైనా అవకాశం రాకపోతుందా? అనే నమ్మకంతో సంజూ నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశాడు. అయినా సరే సూపర్ 8 తొలి మ్యాచ్‌లో సంజూను ఆడించడం లేదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. తుది జట్టు కూర్పుపై మాట్లాడిన సూర్య.. వరుసగా విఫలమవుతున్న అభిషేక్ శర్మ స్థానంలో సంజూను తీసుకోవడం లేదని తెలిపాడు. ఓపెనర్‌గా ఎంపికైన ఈ పవర్ హిట్టర్ సన్నాహక సిరీస్‌లో న్యూజిలాండ్‌పై ఘోరంగా విఫలమయ్యాడు. అభిషేక్ శర్మకు అస్వస్థత కారణంగా నమీబియాపై ఆడినా సున్నాకే ఔటయ్యాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ విధ్వంసక ఆటతో.. మ్యాచ్ విన్నర్‌గా అవతరించి తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అభిషేక్ మూడు డకౌట్లతో నిరాశపరిచిన వేళ.. సూపర్ 8లో శాంసన్‌కు చోటివ్వాలని.. టాపార్డర్‌లో ఒక రైట్‌హ్యాండ్ బ్యాటర్ ఉంటే మేలని విశ్లేషకులు సూచిస్తున్నారు. కానీ, అతడిని నమ్మి మరొకరిపై వేటు వేసేందుకు యాజమాన్యం సిద్ధంగా లేనట్టు తెలుస్తోంది. శనివారం మీడియా సమావేశంలో కెప్టెన్ సూర్యకు ఇదే ప్రశ్న ఎదురైంది.





# సఫారీలతో సై

## నేడు భారత్-సౌతాఫ్రికా టీ20.. రాత్రి 7 గంటలకు మ్యాచ్

సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు తన సూపర్-8 ప్రయాణాన్ని ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో ప్రారంభించనుంది. గత ప్రపంచ కప్ ఫైనలిస్టుల మధ్య జరగనున్న ఈ మ్యాచ్ ప్రేక్షకులకు కనువిందు చేయనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేతో, మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో భారత్ తలపడుతుంది. భారత జట్టు సెమీస్ చేరాలంటే కనీసం రెండు మ్యాచ్‌లలో విజయం సాధించడం అత్యవసరం. ఈ సూపర్-8 మ్యాచులు భారత్, శ్రీలంకలోని ప్రముఖ స్టేడియాలలో జరగనున్నాయి. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం, పల్లెకెలె, అహ్మదాబాద్, ముంబై, చెన్నై మైదానాలు ఈ కీలక పోరుకు ఆతిథ్యమిస్తున్నాయి. సూపర్-8 ముగిసిన తర్వాత, రెండు గ్రూపుల నుంచి టాప్-2లో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. మార్చి 4, 5 తేదీల్లో సెమీఫైనల్స్ నిర్వహించి, మార్చి 8న గ్రాండ్ ఫైనల్ ద్వారా ప్రపంచ విజేత ఎవరో తేలిపోనుంది.

**టీమిండియా సూపర్ - 8 షెడ్యూల్**

ఫిబ్రవరి 22 భారత్ – సౌతాఫ్రికా (అహ్మదాబాద్, రాత్రి 7:00)
ఫిబ్రవరి 26: భారత్ – జింబాబ్వే (చెన్నై, రాత్రి 7:00)
మార్చి 1: భారత్ – వెస్టిండీస్ ( కోల్‌కతా, రాత్రి 7:00)



# శ్రీచరణి.. రప్పా రప్పా

**ఆస్ట్రేలియా పతనాన్ని శాసించిన తెలుగుతేజం**

**టీ20 సిరీస్ గెలిచిన భారత మహిళల జట్టు**

ఆస్ట్రేలియాతో మూడు టీ20ల సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. అడిలైడ్ వేదికగా శనివారం జరిగిన సిరీస్ డిసైడర్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత మహిళల జట్టు 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. స్మృతి మంధాన(55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82) విధ్వంసకర అర్ధ శతకంతో చెలరేగగా.. శ్రేయాంక పాటిల్(3/22), శ్రీచరణి(3/32) మూడేసి వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసింది. స్మృతి మంధానతో పాటు జెమీమా రోడ్రిగ్స్(46 బంతుల్లో 4 ఫోర్లతో 59) హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అన్నబెల్ సదర్లాండ్(2/34) రెండు వికెట్లు తీయగా.. కిమ్ గార్త్, సోఫీ మోలినక్స్ తలో వికెట్ తీసారు. అనంతరం ఆస్ట్రేలియా మహిళల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 159 పరుగులే చేసి ఓటమిపాలైంది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్(3/22), శ్రీచరణి(3/32) మూడేసి వికెట్లతో ఆస్ట్రేలియా పతనాన్ని శాసించారు. అరుంధతి రెడ్డి(2/35) రెండు వికెట్లు తీయగా.. రేణుక సింగ్(1/29) ఒక వికెట్ దక్కింది. ఈ విజయంతో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకుంది. ఈ పర్యటనను విజయంతో ప్రారంభించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు రెండో టీ20లో ఓటమిపాలైంది. కీలకమైన మూడో మ్యాచ్‌లో సమష్టి ప్రదర్శనతో సత్తా చాటింది. డేంజరస్ బ్యాటర్లు అయిన ఫోబీ లిచ్‌ఫీల్డ్(26), గ్రేస్ హ్యారిస్(1), కెప్టెన్ సోఫీ మోలినక్స్(6)లను పెవిలియన్ చేర్చిన తెలుగు తేజం శ్రీచరణి భారత విజయంలో కీలక పాత్ర పోషించింది.వన్డే ప్రపంచకప్ 2026 తర్వాత కాస్త ఫామ్ కోల్పోయి తడబడిన శ్రీచరణి.. తన సత్తా ఏంటో చూపించింది.



# బంగ్లా క్రికెట్ చరిత్రలో చీకటి అధ్యాయం

టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి బంగ్లాదేశ్ జట్టు వైదొలగడం ఆ దేశ క్రికెట్ చరిత్రలో ఓ చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. భద్రతా కారణాలను సాకుగా చూపి భారత్‌లో ఆడేందుకు నిరాకరించిన బంగ్లాదేశ్ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ సీనియర్ అసిస్టెంట్ కోచ్ మహమ్మద్ సలాహుద్దీన్ మాజీ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ నిర్ణయాల వల్ల ఆటగాళ్ల జీవితాలు, వారి దశాబ్దాల కలలు ఎలా నాశనమయ్యాయో ఆయన ఆవేదనతో వివరించారు. బంగ్లాదేశ్ క్రికెట్ లీగ్‌కు ముందు జరిగిన మీడియా సమావేశంలో సలాహుద్దీన్ అత్యంత భావోద్వేగంతో మాట్లాడారు. ఒక్కో ఆటగాడు వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలో ఆడాలని సగటున 27 ఏళ్ల పాటు కఠోర శ్రమ చేస్తారని.. అలాంటి కలను కేవలం కొన్ని రాజకీయ నిర్ణయాలతో ఒక్క సెకనులో తుడిచిపెట్టేశారని మండిపడ్డారు. ఈ అనాలోచిత నిర్ణయం వల్ల జట్టులోని ఇద్దరు కీలక ఆటగాళ్లు ఐదు రోజుల పాటు 'మెంటల్ కోమా' (తీవ్రమైన మానసిక దిగ్భ్రాంతి) లోకి వెళ్లిపోయారని ఆయన వెల్లడించారు. దేశం కోసం త్యాగాలు చేయడానికి ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నప్పటికీ.. వ్యవస్థ లోపాల వల్ల జరిగిన ఈ వ్యక్తిగత నష్టాన్ని ఎవరు పూడుస్తారని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 22-2-2026

## సదాలోచనలే ప్రగతికి సోపానాలు

ఒక్క ఆలోచన జీవితాన్ని మారుస్తుంది అనే మాట అక్షర సత్యం. మానవ వికాసానికి, సమాజ అభ్యున్నతికి పునాది ఆలోచనే. ఈ సువిశాల విశ్వంలో కేవలం మానవుడికి మాత్రమే లభించిన అద్భుత వరం 'ఆలోచనా శక్తి'. ఆ శక్తిని సరైన దిశలో మళ్లించి, లోక కల్యాణం కోసం పరితపించేలా చేయడమే ప్రతి ఏట ఫిబ్రవరి 22న నిర్వహించే 'అంతర్జాతీయ ఆలోచనా దినోత్సవం' ప్రధాన ఉద్దేశ్యం. ఈ దినోత్సవానికి ఒక విశిష్టమైన చరిత్ర ఉంది. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులైన లార్డ్ బాడెన్ పొవెల్, ఆయన భార్య లేడీ ఒలేవ్ బాడెన్ పొవెల్ ఇరువురి పుట్టినరోజు ఫిబ్రవరి 22. వారి సేవలను స్మరించుకుంటూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గర్ల్ గైడ్స్, గర్ల్ స్కౌట్స్ మధ్య సోదరభావాన్ని, అంతర్జాతీయ స్నేహాన్ని పెంపొందించడానికి 1926లో అమెరికాలో జరిగిన నాలుగో అంతర్జాతీయ సదస్సులో ఈ రోజును ఆలోచనా దినోత్సవంగా ప్రకటించారు. 1999లో దీనిని అంతర్జాతీయ ఆలోచనా దినోత్సవంగా మార్చారు. 2026 సంవత్సరం ఈ దినోత్సవానికి అత్యంత ప్రత్యేకం. ఎందుకంటే ఇది 100వ వార్షికోత్సవం. ఈ ఏడాదికి గాను మన స్నేహం అనే ఇతివృత్తాన్ని ఎంచుకున్నారు. సరిహద్దులు, సంస్కృతులు, తరాలకు అతీతంగా మానవ సంబంధాలను బలోపేతం చేయడం, ఒకరికొకరు అండగా నిలబడటం ఈ థీమ్ ముఖ్య ఉద్దేశ్యం. నేటి ఆధునిక యుగంలో సాంకేతికత పెరిగినా, మానవీయ విలువలు మరియు సృజనాత్మక ఆలోచనల అవసరం ఎంతో ఉంది. పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను ప్రోత్సహించాలి. బట్టీ పట్టే చదువుల కంటే, సమస్యలకు పరిష్కారాలను ఆలోచించే మేధస్సును పెంపొందించడం అవసరం. పర్యావరణ పరిరక్షణ, పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువత ఆలోచించి, కార్యాచరణకు పూనుకోవాలి. ఆలోచన అనేది ఒక విత్తనం వంటిది. అది సదాలోచన అయినప్పుడే సమాజం అనే వృక్షం సుభిక్షంగా ఉంటుంది. స్వార్థం వీడి, సామాజిక హితం కోరే ఆలోచనలే రేపటి తరానికి మార్గదర్శకాలు కావాలి. ఈ 100వ అంతర్జాతీయ ఆలోచనా దినోత్సవం సందర్భంగా, మన ఆలోచనలను మరింత విశాలం చేసుకుందాం. ప్రపంచ శాంతిని, స్నేహాన్ని కాంక్షిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుదాం.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం






## "కాంగ్రెస్‌కు రాహుల్ పట్టేంది!

భారత్ తన సాంకేతిక ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ఒక రాజకీయ రణరంగంగా మారడం దురదృష్టకరం. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సదస్సు లోపల చొక్కాలు విప్పి నిరసన తెలపడం, ప్రధానిని ఉద్దేశించి వివాదాస్పద నినాదాలు చేయడం ఒక నిరసనగా కాకుండా, దేశ గౌరవానికి భంగం కలిగించే చర్య. ఈ చర్యను రాహుల్ గాంధీ సమర్థించడం ఆయన నాయకత్వంలోని లోపాలను స్పష్టం చేస్తోంది.

అంతర్జాతీయ ప్రతినిధులు, గ్లోబల్ టెక్ దిగ్గజాలు హాజరైన వేదికపై ఇలాంటి నిరసనలు చేయడం వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆలోచన లేకపోవడం శోచనీయం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, ఎక్కడ, ఎప్పుడు, ఎలా నిరసన తెలపాలో తెలియకపోవడం ఒక జాతీయ పార్టీ నాయకుడికి ఉండాల్సిన పరిణతి కానేకాదు. ఈ నిరసన కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సమన్వయ లోపాన్ని కూడా బయటపెట్టింది. ఒకవైపు కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అదే సదస్సులో పాల్గొని, ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానికి ప్రతిపాదనలు చేశారు. కానీ, రాహుల్ గాంధీ ప్రోద్బలంతో యూత్ కాంగ్రెస్ నిరసనలు తెలపడం డబుల్ గేమ్‌లా కనిపిస్తోంది. నాయకత్వం మధ్య స్పష్టమైన విజన్ లేకపోవడమే దీనికి కారణం. రాహుల్ గాంధీ ఏఐ సమ్మిట్‌ను ఒక పీఆర్ విన్యాసం అని అభివర్ణించారు. డేటా విక్రయానికి జరుగుతున్న ప్రయత్నమని ఆరోపించారు. అయితే, ఏఐని భారతీయ యువత ఎంతలా అక్కున చేర్చుకుందో అన్న విషయం రాహుల్ గాంధీకి తెలియకపోవడం విచారకరం. దేశం ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడే పెట్టుబడులను ఆకర్షించే సమయంలో, ఇలాంటి ఆందోళనలు విదేశీ ఇన్వెస్టర్లలో ప్రతికూల భావనను కలిగిస్తాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ.. వీధి పోరాటాలకు, పార్లమెంటరీ హుందాతనానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించలేకపోతున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను ప్రస్తావించడానికి అంతర్జాతీయ వేదికను అప్రతిష్ఠపాలు చేయడం వల్ల తన పార్టీకి వ్యతిరేకత పెరుగుతుందన్నది గ్రహించకపోవడం ఆయన ఆలోచనాశైలి ఎలాంటిదో అర్థం అవుతోంది. రాజకీయం అంటే కేవలం వ్యతిరేకత మాత్రమే కాదు; జాతీయ ప్రయోజనాలు వచ్చినప్పుడు నిర్మాణాత్మక పాత్రను పోషించడం. ఏఐ సదస్సు వంటి కీలక వేదికలను నిరసనల కోసం వాడుకోవడం, దాన్ని సమర్థించడం ద్వారా రాహుల్ గాంధీ తనను తాను ఒక పరిణతి చెందిన నాయకుడిగా నిరూపించుకునే అవకాశాన్ని కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ పునర్వైభవం సాధించాలంటే, ఇలాంటి అనాలోచిత వ్యూహాలకు స్వస్తి చెప్పి, అభివృద్ధి ఎజెండాతో ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి,

భారత రాజకీయ యవనికపై శతాబ్ద కాలానికి పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఒక విలక్షణమైన అస్తిత్వ పోరాటాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ పునర్నిర్మాణం కోసం రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నాలు, ఆయన ఎంచుకున్న రాజకీయ వ్యూహాలు క్షేత్రస్థాయిలో ఓట్లుగా మలచడంలో విఫలమవుతున్నారు. ప్రత్యర్థుల నుండే కాదు, స్వపక్షంలోని మేధావుల నుంచి కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. రాహుల్ గాంధీ తన రాజకీయ ప్రస్థానంలో తరచుగా సిద్ధాంతాలను మారుస్తూ వస్తున్నారు. ఒకప్పుడు సాఫ్ట్ హిందుత్వ లైన్ తీసుకున్న ఆయన, మరికొద్ది కాలానికే తీవ్రమైన లౌకికవాదంవైపు మళ్ళారు. బీజేపీ బలమైన హిందుత్వ ప్లస్ అభివృద్ధి జాతీయవాదానికి ప్రత్యామ్నాయంగా ఒక స్థిరమైన సిద్ధాంతాన్ని రాహుల్ ప్రతిపాదించలేకపోతున్నారు. మరోవైపు, రాహుల్ గాంధీపై ప్రత్యర్థులు విజయవంతంగా వేసిన ముద్ర 'పార్ట్-టైమ్ రాజకీయవేత్త'. కీలకమైన ఎన్నికల సమయంలో లేదా పార్టీ సంక్షోభంలో ఉన్నప్పుడు ఆయన విదేశీ పర్యటనలకు వెళ్లడం కేడర్‌లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. రాజకీయాలు అనేవి 24 బై 7 అంకితభావంతో కూడిన ప్రక్రియ అని నమ్మే భారతీయ ఓటరుకు, రాహుల్ అడపాదడపా ఉనికి ప్రతికూల సంకేతాలను పంపుతోంది. రాహుల్ గాంధీ చుట్టూ ఉండే ఒక చిన్న మేధావుల బృందం (కోటరీ) క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఉంటుందనే విమర్శ ఉంది. క్షేత్రస్థాయిలో పనిచేసే సీనియర్ నాయకులను పక్కన పెట్టి, ఎన్జీవో నేపథ్యం ఉన్నవారికీ, కార్పొరేట్ సలహాదారులకూ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పార్టీ యంత్రాంగం నిర్వీర్యమవుతోంది. నరేంద్ర మోదీ అనే ఒక శక్తివంతమైన కమ్యూనికేటర్‌ను ఎదుర్కోవడానికి రాహుల్ గాంధీ ఎంచుకున్న శైలి తరచుగా వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతోంది. చౌకీదార్ చోర్ హై వంటి నినాదాలు గతంలో బెడిసికొట్టాయి. ప్రజలు మోదీకి ప్రత్యామ్నాయంగా ఒక విజనరీని కోరుకుంటున్నారే తప్ప, విమర్శకుడిని కాదు. రాహుల్ గాంధీ తనను తాను ఒక సమర్థుడైన పాలకుడిగా ప్రదర్శించుకోవడంలో ఇప్పటికీ వెనుకబడే ఉన్నారు. ఇక, రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలపై అతిగా ఆధారపడుతోంది. కూటమి ధర్మంలో భాగంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన సొంత ఉనికిని త్యాగం చేస్తోంది. ఇది దీర్ఘకాలంలో పార్టీని నామమాత్రపు శక్తిగా మార్చుతోంది. దీన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాహుల్ గాంధీ ఇప్పటికీ గ్రహించలేదేమోనని అనిపిస్తోంది. ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ వంటి కీలక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అట్టడుగు స్థాయికి పడిపోవడానికి రాహుల్ అనుసరించిన అస్పష్టమైన పొత్తుల వ్యూహమే కారణం. రాహుల్ పోరాటంలో నిజాయితీ ఉండి ఉండవచ్చు. కానీ, రాజకీయాలు వ్యూహాలతో, ప్రజల నాడీని పట్టుకోవడంతో ముడిపడి ఉంటాయి. ఇప్పటికైనా తన రాజకీయ శైలిని మార్చుకోకపోతే, కాంగ్రెస్ పార్టీ ఒక చారిత్రక అవశేషంగా మిగిలిపోయినా ఆశ్చర్య పోనవసరం లేదు. పార్టీకి కావాల్సింది ఒక యాత్రికుడు కాదు, ఒక వ్యూహకర్త, పటిష్టమైన యంత్రాంగాన్ని నడిపించే సారథి. దీన్ని రాహుల్ గాంధీ ఎప్పుడు అర్థం చేసుకుంటారో?

శ్రావణ వాణి



శ్రావణ్ కుమార్
బొమ్మకంటి
ఎడిటర్



## అపురూపం.. అద్భుతం.. ట్విన్స్!

### ..నేడు ప్రపంచ కవలల దినోత్సవం..

ప్రకృతి సృష్టిలో కవలలు ఒక అద్భుతం. ఒకేసారి ఇద్దరు ప్రాణాలు లోకంలోకి రావడం, వారి మధ్య ఉండే విడదీయలేని అనుబంధం ఎప్పుడూ ఆసక్తికరమే. కవలల మధ్య మాటలకు అందని మానసిక అనుబంధం ఉంటుంది. ఒకరి ఆలోచనలను మరొకరు గ్రహించడం, ఒకేలా స్పందించడం వారి సహజ లక్షణం. ప్రధానంగా ఒకే పోలికలతో ఉండే 'ఐడెంటికల్ ట్విన్స్', వేర్వేరు పోలికలతో ఉండే 'ఫ్రాటర్నల్ ట్విన్స్' అని రెండు రకాలు ఉంటారు. పురాణాల నుంచి నేటి వరకు కవలలకు ప్రత్యేక స్థానం ఉంది. రామాయణంలో లవకుశులు, భారతంలో నకుల సహదేవులు దీనికి నిదర్శనం. మారుతున్న కాలంలో కవలల పట్ల అవగాహన పెంచడం, వారి ఆరోగ్యం, సామాజిక ఎదుగుదలపై దృష్టి సారించడం ఈ రోజు ప్రధాన ఉద్దేశ్యం. కవలలు కేవలం ఒకేలా కనిపించే ఇద్దరు వ్యక్తులు మాత్రమే కాదు; వారు ఒకే ప్రాణం రెండు రూపాలుగా భావిస్తారు. 19వ శతాబ్దంలో అమెరికాలోని ఒహియో రాష్ట్రంలో మోజెస్, ఆరన్ విల్‌కాక్స్ అనే కవల సోదరులు ఉండేవారు. వారు తమకున్న భూమిని ఒక గ్రామానికి విరాళంగా ఇచ్చి, ఆ ఊరి పేరును 'మిల్స్‌విల్లే' నుండి 'ట్విన్స్‌బర్గ్'గా మార్చాలని కోరారు. వీరి జ్ఞాపకార్థం 1976లో తొలిసారిగా ట్విన్స్‌బర్గ్‌లో ఒక పండుగలా కవలల వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రమంగా ఇది అంతర్జాతీయ స్థాయికి విస్తరించింది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.